క్లుప్తంగా

నేడు 'జగనన్న సురక్ష' కార్యక్రమాలు

సామర్లకోట: పీబీ దేవం సచివాలయంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ డి.శ్రీలలిత చెప్పారు. ఆ గ్రామానికి చెందిన ప్రజలు వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు రావచ్చన్నారు. ప్రజలకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేస్తామని చెప్పారు. అదే విధంగా స్థానిక బ్రౌన్‌పేట సచివాలయం-1లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందన్నారు. మండల స్థాయి అధికారులు సచివాలయం వద్ద ఉండి సమస్యలు పరిష్కరిస్తారని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు.

వాసవీ క్లబ్ సేవలు విస్తృతం


పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

సామర్లకోట: వాసవీ క్లబ్ సేవలు మరింత విస్తృతం చేస్తామని ఆ క్లబ్ అంతర్జాతీయ డైరెక్టర్ చీమకుర్తి కృష్ణకిశోర్ అన్నారు. స్థానిక వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఏర్పాటు చేసిన డాన్‌టు డెస్క్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివిధ రంగల్లో పేదలను గుర్తించి వారిని ఆదుకుంటామని ఆయన చెప్పారు. ఇందులో భాగంగా రైతు బంధులో ఒక రైతుకు పార, కొడవలి, క్రిమి సంహారక మందులు, విత్తనాలు, ఎరువులు అందజేశారు. రక్షణ మిత్రలో ఒక జవానును సత్కరించారు. ఆర్యవైశ్య నేస్తంలో ఒక నిరుపేద ఆర్యవైశ్య కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యావసర సరకులు ఇచ్చారు. 10 మంది నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ప్రజాహితం కార్యక్రమంలో భాగంగా బళ్ల మార్కెట్ సెంటర్, పిఠాపురం రోడ్డు, వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం వద్ద సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వాసవీ వనితా క్లబ్ అధ్యక్షురాలు కటకం పద్మరత్నం అధ్యక్షత వహించగా అంతర్జాతీయ క్లబ్ సభ్యుడు వంకదర ఉదయ్‌కుమార్, రీజినల్ చైర్మన్ కేదారిశెట్టి సురేష్, రీజినల్ కార్యదర్శి గ్రంధి సూరిబాబు, జోన్ చైర్మన్ కడించెర్ల భాను, పీఆర్వో కటకం హైమావతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్విమ్మింగ్ జట్టు ఎంపిక


రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పెద్దాపురం: స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి స్విమ్మింగ్ జట్టు ఎంపికలు జరిగాయి. కాకినాడ జిల్లా అమెట్యూర్ అక్వాటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి సతీష్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా స్విమ్మింగ్ జట్టును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సతీష్, పాఠశాల డైరెక్టర్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ ఈ జట్టు 8, 9 తేదీల్లో గుంటూరు జిల్లా నరసారావుపేటలో జరిగే రాష్ట్ర జూనియర్, సబ్ జూనియర్ స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొంటుందన్నారు. మూడు విభాగాల్లో స్విమ్మింగ్ పోటీల జట్టును ఎంపిక చేశారు. కార్యక్రమంలో బిక్కిన సాయి, రాజు, వెంకట శివరామకృష్ణ, కోచ్‌లు వీరభద్రం, ఎస్‌కే రాజా, వీరబాబు, నాని తదితరులు పాల్గొన్నారు. గ్రూపు-1 జట్టులో క్రీడాకారులు పీఎస్ రఘునందన్‌గౌడ్, క్రితిక్ అన్విష్, సాయి సుమంత్, సుశాంత్, కేఎస్ లయచౌదరి ఉన్నారు. గ్రూప్-2లో అన్సరాయ్, ముఖేష్, మణికంఠ నవీన్, అఖిల్, అర్జున్, ఆహిల్, సాయి సుకేత్, జాన్, శ్రీసాయి, ఓజస్వీదేవి, సింధుజీ, జ్యోతిక, గ్రూపు-3 జట్టులో కె.దర్శిల్, కౌశిక్‌వర్ధన్, రామ్, నిశాంత, అభిషయ్, ఇనోష్, జీబీఎల్ వైష్ణవి, హిమద్యుతి, తన్వీ ఎంపికయ్యారు.

రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అధ్యక్షుడిగా రవికృష్ణ


రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన రవికృష్ణను సత్కరిస్తున్న సభ్యులు

బోట్‌క్లబ్: రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అధ్యక్షుడిగా నరహరిశెట్టి రవికృష్ణ బాధ్యతలు స్వీకరించారు. స్థానిక రోటరీ హాల్‌లో ఆదివారం క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులతో క్లబ్ మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావు ప్రమాణ స్వీకారం చేయించారు. దీనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆదిత్య విద్యా సంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో యువతకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మహిళలు కూడా సేవా రంగంలో ముందుంటున్నారన్నారు. క్లబ్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన రవికృష్ణ మాట్లాడుతూ సీఎస్ఆర్ ఫండ్స్ సేకరించి ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తానన్నారు. నూతన సభ్యులను రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ ట్రెజరర్ కర్రి వీర్రెడ్డి అభినందించారు.

సొంతింటి కల.. నిజమయ్యే వేళ

- టిడ్కో ఇళ్ల రిజిస్ట్రేషన్లు పూర్తి
- సర్వ హక్కులతో లబ్ధిదారులకు అందించడానికి ఏర్పాట్లు
- నేడు మంత్రి చేతుల మీదుగా పంపిణీ


పిఠాపురంలో టిడ్కో పథకంలో నిర్మించిన గృహ సముదాయాలు

పిఠాపురం: పట్టణ ప్రాంత పేదల సొంతింటి కల నిజం కానుంది. ప్రభుత్వ ఆదేశాలతో ఏపీ టిడ్కో (టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ద్వారా నిర్మించిన గృహాలను లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేశారు. పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలోని గోర్స రైల్వే గేటు సమీపంలో 496, 498, 547, 121 సర్వే నెంబర్లలో అపార్ట్‌మెంట్లు నిర్మించారు. రూ.57 కోట్ల వ్యయంతో 28 భవనాల్లో 864 మందికి గృహ నిర్మాణాలు పూర్తవ్వగా గతంలోనే లబ్ధిదారులకు గృహాలు కేటాయించారు. అప్పట్లో రూ.500, రూ.12,500, రూ.25,000, రూ.50,000 లబ్ధిదారులు చెల్లించేలా గృహాలను కేటాయించారు. అయితే వాటిని ఇప్పటివరకూ లబ్ధిదారులకు అందజేయలేదు. సోమవారం రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చేతుల మీదుగా లబ్ధిదారులకు సర్వ హక్కులతో ప్లాట్లు అందజేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

రుసుము లేకుండా రిజిస్ట్రేషన్లు

ఈ గృహాలను 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో 274 గృహాలు, 365 చదరపు అడుగుల విస్తీర్ణంలో 286 గృహాలు, 430 చదరపు అడుగుల విస్తీర్ణంలో 304 గృహాలు నిర్మించారు. వీటిలో 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన గృహాలను ప్రభుత్వం రూ.1కే లబ్ధిదారులకు అందజేసినా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జాప్యమైంది. ఇటీవల ప్రభుత్వ ఆదేశాలతో 300 చదరపు అడుగుల విస్తీర్ణమున్న ఇళ్లతో పాటు 365, 430 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఇళ్లల్లో బ్యాంకు లింకేజీ పూర్తయిన వాటికి రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. రిజిస్ట్రేషన్లను ఎటువంటి ఫీజు లేకుండా చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, యూజర్ చార్జీలను మినహాయిస్తూ ప్రభుత్వం గతేడాది జీఓ నంబరు 27, 28, 29 విడుదల చేసింది. ఒక్కసారిగా ఎక్కువ రిజిస్ట్రేషన్లు చేయడం కష్ట సాధ్యం కాబట్టి ప్రణాళిక బద్ధంగా చేపట్టి వేగవంతంగా పూర్తి చేశారు.

పిఠాపురంలో టిడ్కో గృహాలు	
మొత్తం టిడ్కో గృహాలు	- 864
లబ్ధిదారులు	- 864 మంది
రిజిస్ట్రేషన్లు పూర్తయినవి	- 800
నిర్మాణ వ్యయం	- రూ.57 కోట్లు

ఇళ్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి



టిడ్కో ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొలిక్కి రావడంతో పంపిణీకి ఏర్పాట్లు చేశాం. పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలోని గృహాలకు తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి కనుక శరవేగంగా విద్యుత్ కనెక్షన్‌లు ఇప్పించే ఏర్పాట్లు చేశాం. సోమవారం మంత్రి ఆదిమూలపు సురేష్ లబ్ధిదారులకు ఇళ్లను అందజేస్తారు.

– కృష్ణవేణి, కమిషనర్, పిఠాపురం మున్సిపాలిటీ

కిటకిటలాడిన మరిడమ్మ సన్నిధి


భక్తులతో కిక్కిరిసిన మరిడమ్మ ఆలయం

పెద్దాపురం: ఆషాఢ మాసం ఆదివారం సందర్భంగా మరిడమ్మ అమ్మవారి ఆలయానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు ఆధ్వర్యాన ఏర్పాట్లు చేశారు. సీఐ అబ్దుల్ నబీ పర్యవేక్షణలో ఎస్సై వెలుగుల సురేష్ ఆధ్వర్యాన బందోబస్తు నిర్వహించారు. పెద్దాపురం బ్రాహ్మణ సేవా సంఘం, సామర్లకోట లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన యాత్రికులకు ఉచితంగా పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు.

క్రీడల అభివృద్ధిలో కృషి అభినందనీయం

కాకినాడ రూరల్: ప్రపంచ వ్యాప్తంగా వివిధ రకాల క్రీడల అభివృద్ధికి, క్రీడా సంస్కృతిని బలోపేతం చేయడంలో పాత్రికేయుల కృషి అభినందనీయమని రాష్ట్ర టెన్నికాయిట్ అధ్యక్షుడు వైడీ రామారావు అన్నారు. ప్రపంచ క్రీడా పాత్రికేయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో పలువురు క్రీడా పాత్రికేయులను ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా వైడీ రామారావు మాట్లాడుతూ క్రీడలు జీవితంలో ఒక భాగం కావాలని అన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, అద్దాల సత్యనారాయణ, సువర్ణరాజు, వెంకటరమణ, రవిశంకర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హారతి సాయిబాబా..


సామర్లకోటలో షిరిడీ సాయిబాబా వారి గ్రామోత్సవం

- బాబాకు భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం
- ఆకట్టుకున్న బాలికల కోలాటం


సామర్లకోట సాయిబాబాకు పూతరేకులతో నైవేద్యం

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లోని షిరిడీ సాయిబాబా ఆలయం నుంచి బాబావారి పల్లకి గ్రామోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. గురుపూర్ణిమను పురస్కరించుకుని ఈ ఉత్సవం నిర్వహించారు. షిరిడీ సాయిబాబా వారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో ఉంచి పట్టణ పురవీధుల మీదుగా గ్రామోత్సవం జరిపారు. దీనిని దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు ప్రారంభించారు. గుమెళ్ల భవానీ ఆధ్వర్యంలో బాలికలచే కోలాటం ఎంతగానో ఆకట్టుకుంది. ఆలయ కమిటీ అధ్యక్షుడు డి.అప్పారావు, కార్యదర్శి జి.సత్యనారాయణ, కోశాధికారి డి.రాజబాబు ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బాణకాల్పులు, బ్యాండ్ మేళాల ప్రదర్శన ప్రత్యేకఆకర్షణగా నిలిచింది. మహిళా భక్తులు, కోలాటం బాలికలు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు కొప్పన రాంబాబు, సేపేని సూరిబాబు, పెదిరెడ్డి సూర్యనారాయణ, గంద్రేటి వెంకట రమణ, పోతాబత్తుల సత్యనారాయణ భక్తులకు సేవలందించారు. ఇదిలా ఉంటే బాబాకు భక్తులు 1,100 పూత రేకులతో నైవేద్యం సమర్పించారు. శ్రీసాయి భక్త మహిళా మండలి సత్తి అరుణ బృందంచే సాయినాథ స్తవన మంజరి, నిత్య పారాయణ ప్రవచన గ్రంథ పారాయణ చేశారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి స్థానిక రైల్వే కల్యాణ మండపంలో అన్నదానం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

శాకంబరిగా ముత్యాలమ్మ, వాసవీ మాత


శాకంబరి అలంకరణలో ముత్యాలమ్మ అమ్మవారు


శాకంబరి దేవిగా దర్శనమిచ్చిన వాసవీ మాత

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారిని ఆదివారం శాకంబరిగా అలంకరించారు. ముత్యాలమ్మ అమ్మవారిని కుమారరామ భీమేశ్వరస్వామి దేవస్థానం దీపారాధన సంఘ సభ్యులు కూరగాయలు, పండ్లతో అలంకరించి పూజలు చేశారు. ఆదివారం కావడంతో కార్లు, బస్సులు, లారీలు, ద్విచక్ర వాహనాలపై వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో కాకినాడ రోడ్డు తిరునాళ్లను తలపించింది.

పిఠాపురం: ఆషాఢ మాసం సందర్భంగా పిఠాపురంలో వేంచేసియున్న వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో వాసవీ మాత ఆదివారం శాకంబరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని భక్తులు అందజేసిన వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సాయం కాలం.. సాగర తీరం


తీర ప్రాంతంలో సేద తీరుతున్న పర్యాటకులు


కెరటాల్లో కేరింతలు కొడుతున్న పర్యాటకులు

కొత్తపల్లి: ఉప్పాడ సాగర తీరం ఆదివారం పర్యాటకులతో సందడిగా మారింది. సెలవు దినం, వేసవి తాపం ఇంకా తగ్గకపోవడంతో అధిక సంఖ్యలో పర్యాటకులు సాగర తీరానికి చేరుకుని ఉపశమనం పొందారు. తీరంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు తీర ప్రాంతంలో పర్యటించి యువత సముద్రపు కెరటాల వైపుకి వెళ్లొద్దని హెచ్చరించారు. తుని లోవలోకి వెళ్లిన భక్తులు సైతం తీర ప్రాంతంలో ఆగి సేద తీరారు.

కాలువలో వ్యక్తి మృతదేహం

సామర్లకోట: స్థానిక గోదావరి కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహన్ని ఆదివారం సాయంత్రం పోలీసులు గుర్తించారు. పంచారామ క్షేత్రం, అగ్రికల్చర్ ఫారానికి వెళ్లే మార్గంలోని గోదావరి కాలువలో మృతదేహాన్ని బయటకు తీశారు. బిస్కెట్ రంగు ఫుల్ హ్యాండ్స్ షర్టు, నలుపు రంగు ప్యాంట్ మెడలో ఎరుపు రంగు టవల్ ఉంది. మృతుని వివరాల కోసం 94407 96568 నంబరులో సంప్రదించాలని సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు.

అంతకంతకూ.. తగ్గుతూ..

- కష్టాల్లో కర్ర పెండలం సాగు
- ధర తగ్గిస్తున్న సగ్గు బియ్యం మిల్లర్లు
- ప్రత్యామ్నాయ పంటలపై రైతుల దృష్టి


నాట్లకు సిద్ధం చేస్తున్న దుంప కర్ర విత్తనం

సామర్లకోట: మెట్ట రైతన్న కల్పతరువు కర్రపెండలం సాగు.. ఉమ్మడి జిల్లాలో 1960 నుంచి 2010 వరకూ ఈ సాగు లాభాల బాటలో నడించింది. అయితే పంట విస్తీర్ణం ప్రతి ఏడాదీ తగ్గిపోతోంది. పదేళ్లుగా పెరగని ధరతో రైతులు ఈ సాగు పట్ల విముఖత చూపుతున్నారు. లాభసాటిగా ఉన్న పంటల వైపు మళ్లుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 50 నుంచి 60 వేల ఎకరాలలో సాగయ్యే దుంప గత ఏడాది 10 వేల ఎకరాలకు తగ్గిపోయింది. ప్రస్తుతం ఆరు వేల ఎకరాలకు పడిపోయింది. గత ఏడాదికి పుట్టు (225 కిలోలు)కు రూ.1,600 ఇస్తామని చెప్పిన సగ్గు బియ్యం మిలర్లు రూ.1,400ను రైతుల పోరాటంతో అతికష్టం మీద చెల్లించారు. జూన్ నెలాఖరు నుంచి దుంప నాట్లు ప్రారంభమయ్యాయి. సాగు లాభసాటిగా లేక అంతకంతకూ తగ్గిపోతున్నారు.

గిట్టుబాటు ధర లేక..

మెట్టప్రాంత సాగుగా పేరొందిన దుంప ఎకరానికి 30 నుంచి 40 పుట్లు దిగుబడి వచ్చేది. పంట మార్పిడి చేయక పోవడంతో ఎకరానికి 20 పుట్లు మాత్రమే వస్తుందని రైతులు వాపోతున్నారు. పదేళ్లుగా పెట్టుబడులు, భూమి కౌలు పెరిగినా సగ్గు బియ్యం మిలర్లు దుంప ధర పెంచకపోవడంతో గిట్టుబాటు కాని వ్యవసాయం చేయలేమని రైతులు చెబుతున్నారు. దీంతో పామాయిల్ తోటలు వేస్తున్నామని అంటున్నారు.

ప్రధానంగా ఎక్కడంటే..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈ పంట 18 మండలాల్లో సాగవుతున్నా ప్రధానంగా సామర్లకోట, పెద్దాపురం, రంగంపేట, జగ్గంపేట, రాజవొమ్మంగి, గంగవరంలో ఎక్కువగా సాగు జరుగుతుంది. మిగిలిన మండలాల్లో అరకొరగానే పండిస్తున్నారు. దుంప నుంచి సగ్గు బియ్యం చేసే మిల్లులు మాత్రం సామర్లకోట, పెద్దాపురం, జగ్గంపేట, గోకవరం మండలాల్లో మాత్రమే ఉన్నాయి. దీంతో మిలర్లు ఆడిందే ఆట, పాడిందే పాటగా సాగుతుందని రైతులు అంటున్నారు.

ఆధునిక వంగడాల కొరత



దుంప పంటకు ఆధునిక వంగడాల కొరత వేధిస్తుంది. నాణ్యమైన విత్తనం ఉంటే ఎకరానికి 50 నుంచి 60 పుట్ల దుంప దిగుబడి వస్తుంది. ప్రస్తుతం 25 నుంచి 30 పుట్లకు మించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సగ్గు బియ్యం కొనుగోలు చేసి మిలర్లకు భరోసా ఇవ్వడం ద్వారా రైతులకు గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉంది.

– పుట్టా సోమన్నచౌదరి, దుంప రైతు సంఘ పూర్వ అధ్యక్షుడు, మర్రిపూడి

అందుబాటులో విత్తనాలు



పెద్దాపురం దుంప పరిశోధన కేంద్రంలో ఆధునిక దుంప విత్తనం సమృద్ధిగా ఉంది. ఎస్సీ రైతులకు ఉచితంగా, మిగిలిన రైతులకు కనీస ధరకు అందజేస్తున్నాం. దీనిని రైతులు గమనించాలి. ఆధునిక వంగడాలతో ఎకరానికి 50 పుట్ల దిగుబడి వస్తుంది.

– డాక్టర్ జానకి, దుంప పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, పెద్దాపురం

ఐకమత్యంతో ప్రత్యేక స్థానం


శెట్టిబలిజ ఆత్మీయ సమావేశంలో ఐక్యతను చాటుతున్న నాయకులు

కాకినాడ సిటీ: జిల్లాలో శెట్టిబలిజ సామాజిక వర్గీయులంతా ఐక్యంగా ఉండి, రాజకీయాల్లో ప్రత్యేక స్థానం సాధించేందుకు కృషి చేయాలని జిల్లా శెట్టిబలిజ నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జిల్లా శెట్టిబలిజ సంఘ భవనంలో ఆ సంఘీయుల జిల్లా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. దీనికి జిల్లా శెట్టిబలిజ సంఘం ఉపాధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది నులుకుర్తి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. జిల్లా, రాష్ట్ర స్థాయి నేతలు మాట్లాడుతూ శెట్టిబలిజ కులస్తులంతా ఒకేతాటిపైకి వచ్చి సంఘం ఐక్యతను చాటడం ద్వారా రాజకీయ పార్టీలకు కనువిప్పు కలుగజేయాలన్నారు. ప్రతి పార్టీ జిల్లాలో రెండు అసెంబ్లీ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ముందుగా శెట్టిబలిజ జాతిపిత దొమ్మేటి వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వర్లు, చొల్లంగి వేణుగోపాల్, వాసంశెట్టి రాజేశ్వరరావు, గీసాల శ్రీను, పెంకే శ్రీనివాసబాబా తదితరులు సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు.

స్వైర విహారం..

- కాకినాడ జీజీహెచ్‌లో పశువుల సంచారం
- భయాందోళనలో రోగులు, సహాయకులు


కాకినాడ జీజీహెచ్‌లో క్యాన్సర్ వార్డు ఎదురుగా తిష్టవేసిన ఆవులు

కాకినాడ క్రైం: ఆరోగ్య ప్రదాయిని అది.. నిత్యం వేలాది మంది రోగులకు సేవలు అందించే ప్రాంతమిది.. అలాంటి కాకినాడ జీజీహెచ్‌లో పశువుల సంచారం అధికమైంది. రోగులకు యాతన వచ్చి పడింది. సాయంత్రం అయితే వాటి ఉనికి మరింత ఎక్కువవుతోంది. వీటి నిరోధానికి యాజమాన్యం ఎటువంటి చర్యలు తీసుకోక పశువుల స్వైర విహారానికి అడ్డుకట్ట లేకుండా పోయింది. జీజీహెచ్‌లో రోగులు, వారి బంధువులు సంచరించే ప్రదేశాల్లో ఇవి సేద తీరుతున్నాయి. ఇవి ఏ సందర్భంలోనైనా తిరగబడొచ్చన్న వేదన అధికమవుతోంది. వాహనాల పార్కింగ్ స్థలాల్లోనూ తిష్ట వేస్తున్నాయి. వాటిని కదపడం ఎవరివల్లా కావడం లేదు. ప్రమాదకర వ్యర్థాలు నిర్వహించే డంప్ యార్డుల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. డస్ట్ బిన్‌ల నుంచి వ్యర్థాలు నోటితో లాగి చెల్లాచెదురు చేస్తున్నాయి. వార్డుల ఆవరణల్లో తిష్టవేసి లోపలి రోగులను బయటకు, బయట రోగులు లోపలకు వెళ్లకుండా అడ్డుకుంటున్నాయి. గంభీరంగా అరుస్తూ రోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇటీవల సర్జికల్ బ్లాక్ వద్ద ఓ ఆవు చేసిన వీరంగం అంతా ఇంతా కాదు. 70 ఏళ్ల రోగి బంధువు వెంట గంభీరంగా పడటంతో ప్రాణం పోయినంత పనైంది. అక్కడున్న తోటి రోగుల బంధువులు ఆ వృద్ధురాలిని రక్షించారు.

కుక్కలు... ఆవులే అధికం

ఆసుపత్రిలో సంచరిస్తున్న జంతువుల్లో కుక్కలు, ఆవులు అధికంగా ఉంటున్నాయి. పదుల సంఖ్యలో ప్రతి రోజు ఆసుపత్రిలో యథేచ్ఛగా తిరుగుతున్నాయి. అదుపు తప్పిన గోవులు, ఎద్దులను నిలువరించడం సాధ్యం కావడం లేదు. కుక్కల్లో కొన్ని విచ్చలవిడిగా ప్రవర్తిస్తూ రోగులకు హాని చేస్తాయేమోనన్న భయం కలిగిస్తున్నాయి. నేరుగా కొన్ని వార్డులలో లోపలకు కూడా కుక్కలు ప్రవేశిస్తూండడం ఆందోళన కలిగిస్తోంది. వీటిపై నర్సులు నేరుగా ఫిర్యాదు చేస్తున్నా యాజమాన్యం నుంచి స్పందన లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

గ్రిల్ పాత్‌లతో మేలు

జీజీహెచ్‌లో ప్రవేశానికి ఏడు మార్గాలు ఉన్నాయి. ఇందులో రెండు చోట్ల మాత్రమే పశువులు లోపలకు ప్రవేశించకుండా గ్రిల్ మార్గాలు ఏర్పాటు చేశారు. మిగిలిన ఐదు దారులు సాధారణమైనవి. వాటిని గ్రిల్ పాత్‌లుగా మార్చితే పశువులు ఆసుపత్రిలోకి ప్రవేశించే ఆస్కారం తక్కువగా ఉంటుంది. ఆ దిశగా ఆలోచన చేయాలని రోగులు ఆసుపత్రి యాజమాన్యాన్ని కోరుతున్నారు.

నిరోధానికి చర్యలు

ఆసుపత్రిలో పశువుల సంచారం గతం కంటే తగ్గింది. ఉన్నవాటి నిరోధానికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తాం. గ్రిల్ పాత్‌ల ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తాం. భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేస్తాం. సమస్యను శాశ్వతంగా పరిష్కరించే లోపు తాత్కాలిక పరిష్కారాలు చూపుతాం. సాయంత్రం వేళ కట్టుదిట్టమైన చర్యలకు తగిన ఆదేశాలిస్తాం.

– డాక్టర్ హేమలతాదేవి, సూపరింటెండెంట్, జీజీహెచ్

సేవ చేసి.. ఉదారత చాటి


సహాయం అందజేస్తున్న సృజన హాస్పిటల్ అధినేత సత్యవతి తదితరులు

బాలాజీచెరువు: రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల చారిటబుల్ ట్రస్ట్ (1978) ద్వారా ఆరేళ్లలో రూ.80 లక్షల విలువైన సేవా కార్యక్రమాలు నిర్వహించామని ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బాదం బాలకృష్ణ తెలిపారు. స్థానిక దేవాలయం వీధిలోని ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం రూ.2 లక్షల విలువైన స్కాలర్‌షిప్, వినికిడి యంత్రాలను సృజన హాస్పిటల్ అధినేత డాక్టర్ ఎ.సత్యవతి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యవతి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులంతా కలసి సామాజిక సేవలు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రెసిడెంట్ సీమకుర్తి పాపారావు, కల్యాణి, అరుణ్‌కుమార్, వాడకట్టు సురేష్, రామచరణ్ తదితరులు పాల్గొన్నారు.